క్లుప్తంగా

నేటి నుంచి మహా చండీయాగం

మధురపూడి: లోక కళ్యాణార్థం శతకుండాత్మక, మహారుద్ర, మహాచండీ సహిత రాజశ్యామల మహాయాగం నిర్వహిస్తున్నట్టు జనసేన పార్టీ నాయకుడు, ఓం శివశక్తి పీఠం ధర్మకర్త బత్తుల బలరామకృష్ణ అన్నారు. ఆయన మంగళవారం కోరుకొండ మండలం గాదరాడలోని ఓం శివ శక్తి పీఠంలో విలేకరులతో మాట్లాడారు. పీఠంలో బుధవారం నుంచి సోమవారం వరకూ ఆరు రోజుల పాటు యాగం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పించామన్నారు.

బాబాకు క్షీరాభిషేకం

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడిలో కొలువైన సాయిబాబాకు నిత్యం 108 లీటర్ల పాలతో అభిషేకం చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఆలయ గురువు మామిడిపల్లి రామారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్తిక మాసాన్ని పురస్కరించుకుని నెలంతా ఉదయం నుంచి రాత్రి వరకూ 24 గంటలూ ఓం శ్రీసాయిరామ్ నామ జపయజ్ఞం జరుగుతోంది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహిస్తున్నారు.

వంటసామగ్రి పంపిణీ



వంట పాత్రలు అందిస్తున్న దృశ్యం

సీతానగరం: పురుషోత్తపట్నం పంచాయతీ పరిధిలోని రామచంద్రపురం ఎంపీయూపీ స్కూల్‌కు ప్రభుత్వం మధ్యాహ్న భోజనం పథకానికి సంబంధించిన వంట సామగ్రి పంపిణీ చేసింది. వాటిని వైఎస్సార్ సీపీ నాయకుడు చల్లమళ్ల కృష్ణ, ప్రధానోపాధ్యాయుడు కేఆర్‌ఏ రామకృష్ణ మంగళవారం మధ్యాహ్న భోజనం పథకం సిబ్బందికి అందజేశారు.

సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



కొంకుదురులో సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

బిక్కవోలు: భౌతిక శాస్త్రంలో నోబెల్ ప్రైజ్ సాధించిన భారతరత్న సీవీ రామన్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని కొంకుదురు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మల్లిపూడి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సీవీ రామన్ వర్ధంతి సందర్భంగా స్థానిక ఉన్నత పాఠశాల వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

రంగంపేట: మండలంలోని నల్లమిల్లిలో మంగళవారం విద్యుదాఘాతంతో గేదె మృతి చెందింది. సర్పంచ్ నల్లా పద్మావతి తెలిపిన వివరాల ప్రకారం స్థానిక రైతు నెల్లి సూర్యనారాయణకు చెందిన గేదె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. గేదె మృతితో రూ.80 వేల నష్టం వాటిల్లిందని రైతు సూర్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశాడు. ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తు పెంచాలని విద్యుత్తు శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

లక్ష్మీ హ్యుందాయ్‌లో స్మార్ట్‌కేర్ క్లినిక్ శిబిరం

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరంలోని లక్ష్మీ హ్యుందాయ్ లాలాచెరువు, బొమ్మూరు, మల్కిపురం, అమలాపురం వర్కుషాపులలో ఈనెల 29వ తేదీ వరకూ స్మార్ట్‌కేర్ క్లినిక్ శిబిరంలో ఆఫర్లు ఇస్తున్నట్టు ఆ సంస్థ హెడ్ ఆఫ్ ఆపరేషన్ జీఎం సునీల్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఫ్రీ70 పాయింట్ చెకప్, మెకానికల్ పార్ట్‌లపై 10 శాతం, మెకానికల్ లేబర్‌పై 15 నుంచి 20 శాతం, వీల్ ఎలైన్మెంట్, బ్యాలెన్సింగ్‌పై 15 శాతం, ఇంటీరియల్, ఎక్స్‌పెరియల్ బ్యూటిఫికేషన్, డ్రైవాష్‌పై 20 శాతం స్పెషల్ డిస్కౌంట్ ఆఫర్లు ఉన్నాయన్నారు.రూ. వెయ్యి మంది లక్కీ కస్టమర్లకు రివార్డ్స్ బైషెల్ ఇండియా గిఫ్ట్‌ప్యాక్‌లు ఇస్తామన్నారు. ఇతర వివరాలకు సర్వీస్ మేనేజర్ 80966 66391, 80966 66085 ను సంప్రదించాలన్నారు.

యువ భారత్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడిగా వినురెడ్డి



నల్లమిల్లి వినురెడ్డి

అనపర్తి: యువ భారత్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడిగా అనపర్తికి చెందిన నల్లమిల్లి వినురెడ్డి నియమితులయ్యారు. దీనికి సంబంధించి ఫౌండేషన్ జాతీయ ప్రతినిధి ఆకర్స్ లితోరియా నుంచి మంగళవారం ఉత్తర్వులు అందినట్లు వినురెడ్డి తెలిపారు. జిల్లా విద్యార్థి నాయకుడిగా, జిల్లాలోని పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధిగా వినురెడ్డి సేవలందిస్తున్నారు.

మాలధారణం.. నియమాల తోరణం..

- ఆధ్యాత్మికత, ఆరోగ్య సూత్రాల మేళవింపు అయ్యప్ప దీక్ష
- ఏటా పెరుగుతున్న మాలధారుల సంఖ్య



జి.మామిడాడ మణికంఠ స్వామి ఆలయంలో భిక్ష చేస్తున్న అయ్యప్ప భక్తులు

పెదపూడి: కార్తిక మాసం మొదలు మకర సంక్రాంతి వరకూ అయ్యప్ప దీక్షల కోలాహలం కనిపిస్తుంది. ఆధ్యాత్మికత, ఆరోగ్య సూత్రాల మేళవింపు అయ్యప్ప దీక్ష. ఎంతో పవిత్రత, నిష్ఠతో 41 రోజుల పాటు కఠిన దీక్ష ఆచరించిన స్వాములు ఇరుముడులు ధరించి శబరిమల అయ్యప్పను దర్శించుకుంటారు. స్వామి దర్శనానికి ముందు 18 మెట్లు ఎక్కాలి. ఈ మెట్లను అధిరోహించడం ద్వారా అవిద్య, అజ్ఞానం తొలగిపోయి స్వామి అనుగ్రహం లభిస్తుందని దీక్షదారుల నమ్మకం.

దీక్షలో ఆధ్యాత్మికం

మానవ విలువలను పెంపొందించుకునేందుకు అయ్యప్ప దీక్ష దోహదపడుతుంది. మాలాధారణ, నల్లని వస్త్రధారణ, చన్నీటి స్నానం, విభూతి, చందనం, కుంకుమతో అలంకరించుకోవడం ఆధ్యాత్మికతకు ఉపకరిస్తాయి. శరీరంపై భస్మధారణ ఈశ్వర సంకేతానికి, నుదుటిపై మెరిసే తిరునామం విష్ణుమూర్తిని గుర్తు చేస్తాయి.

ఆరోగ్య ప్రయోజనాలు అనేకం

41 రోజుల దీక్ష ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుంది. భక్తి భావంతో పాటు ఆహార అలవాట్లలో మార్పుల కోసం అనేక మంది అయ్యప్ప దీక్షలను తీసుకుంటారు. ఉదయాన్నే నిద్రలేవడం చైతన్యానికి ప్రతీకగా, సూర్యోదయానికి ముందే చన్నీటి స్నానంతో నాడీ వ్యవస్థను ఉత్తేజపరచడం, నేలమీద పడుకోవడం ద్వారా వెన్నునొప్పుల సమస్యలు తగ్గిపోవడం, కండరాల పటిష్టత, రక్త ప్రసరణ వ్యవస్థ మెరుగునకు దోహదపడుతుంది. నిత్య దీపారాధనతో మనసు తేలికపడి స్నేహం, ప్రేమానురాగాలు పెరుగుతాయి. పొగ తాగడం, మద్యపానం వంటి దురలవాట్లకు దూరంగా ఉండటం ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుంది.

మాలధారణతో మార్పునకు అవకాశం



అయ్యప్ప దీక్ష నియమాలు ఎంతో కఠినంగా ఉంటాయి. మాలధారణ వల్ల ఆధ్యాత్మిక చింతనతో పాటు తనను మార్చుకునే అవకాశం ఉంటుంది. క్రమశిక్షణ అలవడుతుంది. నిష్ఠతో దీక్ష చేసేవారు ఆదర్శంగా నిలుస్తారు.

– వుంద్రు సత్యనారాయణ, కరకుదురు

మానవత్వపు విలువలు పెంపొందుతాయి



నేను పదేళ్లుగా అయ్యప్ప మాల ధరిస్తున్నా. నడవడికలో ఆరోగ్యంలో జీవన విధానంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. మాలధరణతో మనిషిలో మానవతా విలువలు పెంపొందుతాయి. మాలధారణ నియమాలు ఎదుగుదలకు దోహదపడతాయి.

– ద్వారంపూడి యువరాజారెడ్డి, జి.మామిడాడ

స్నేహభావం పెరుగుతుంది



అయ్యప్ప మాలధారణ జీవన ప్రమాణాలను పెంచుతుంది. ప్రతిఒక్కరూ తమ విధిని గుర్తిస్తారు. సంఘ జీవిగా ఎలా ఉండాలో నేర్చుకుంటారు. తోటి వారిని ఎలా గౌరవించాలో అలవరచుకుంటారు. పూజలు, భజనల ద్వారా స్నేహభావం పెంపొందుతుంది.

– డీఆర్‌కే రెడ్డి, జి.మామిడాడ

సంక్షేమ సారథి జగన్‌ను మళ్లీ ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- కొంకుదురులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం



కొంకుదురులో సచివాలయ భవనం ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు మళ్లీ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం కొంకుదురు సచివాలయం–2 పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా పార్టీలకతీతంగా సంక్షేమం, అభివృద్ధి అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలందరూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. ముందుగా గ్రామంలో రూ.44 లక్షలతో నిర్మించిన సచివాలయం–2 భవనం, రూ.20 లక్షల గడప గడపకూ మన ప్రభుత్వ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డులను ఆయన ప్రారంభించారు. అనంతరం సంక్షేమం, అభివృద్ధి బోర్డు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి, సర్పంచ్ సత్తి వీరమణి, జిల్లా మహిళ సంక్షేమ స్థాయి సంఘం చైర్‌పర్సన్ రొంగల పద్మావతి, ఎంపీటీసీ కొంకుదురు పీవీ, సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, వైఎస్సార్ సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, కొమరిపాలెం ఉపసర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాధికారత సీఎం జగన్‌తోనే సాధ్యం

పెదపూడి: సాధికారత, సంక్షేమాభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ పార్లమెంటు నియోజకవర్గం బీసీ సెల్ కన్వీనర్ కేతా శ్రీనివాస్ అన్నారు. జి.మామిడాడ సచివాలయం–2లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల లబ్ధి వివరాలు తెలియజేసే బోర్డు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ లంక మున్ని, ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు కర్రి వెంకటపద్మావతి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కర్రి శ్రీవెంకటరెడ్డి, మంగళవారం నోడల్ ఆఫీసర్ ఎం.సత్యనారాయణరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, గ్రామ కన్వీనర్ ద్వారంపూడి సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు

రంగంపేట: పేదల జీవితాల్లో వెలుగులు నింపిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న అన్నారు. మంగళవారం మండలంలోని ఈలకొలను సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల వివరాల బోర్డును ప్రారంభించి, వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ, మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొల్లాటి ఇజ్రాయిల్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, వైఎస్ ఎంపీపీ రాయుడు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే ప్రతి ఇంటా సంక్షేమం

గోకవరం: రాష్ట్రంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అమలు కావాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తిరిగి అధికారం రావాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. కొత్తపల్లి గ్రామంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. తొలుత గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. స్థానిక సచివాలయంలో సంక్షేమం, అభివృద్ధిని ఫ్లెక్సీని ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో నూతనంగా నిర్మించిన ఎస్సీ, బీసీ కమ్యూనిటీ భవనాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు, స్థానిక నాయకులు తోట బాబి, తాళాబత్తుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ ఆశీర్వదించండి

అనపర్తి: అర్హతే ప్రామాణికంగా పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాల లబ్ధిని చేకూరుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి విజ్ఞప్తి చేశారు. స్థానిక గ్రామ సచివాలయం –1 పరిధిలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పార్టీ జెండాను ఆవిష్కరించడంతో పాటు సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వారా కుమారి, ఉపసర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, ఎంపీటీసీలు తుమ్మా రాజేశ్వరి సత్తిబాబు, కొండేటి భీమేష్ తదితరులు పాల్గొన్నారు.



అనపర్తిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న సత్తి రామకృష్ణారెడ్డి



కొత్తపల్లిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



జి.మామిడాడలో సంక్షేమ పథకాల వివరాలు తెలిపే బోర్డు ఆవిష్కరిస్తున్న నేతలు



ఈలకొలనులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

గౌరమ్మ సంబరం చూతము రారండి



ఊలపల్లి పెద్ద గౌరమ్మ

బిక్కవోలు: మండలంలోని ఊలపల్లిలో రెండేళ్ల కోసారి జరిగే గౌరమ్మ సంబరానికి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. బుధవారం గ్రామంలోని చిన గౌరమ్మ, పెదగౌరమ్మ తల్లి ఆలయాల వద్ద భక్తులు రెండు వర్గాలుగా ఏర్పడి జాతర నిర్వహించనున్నారు. గ్రామంలోని చిన వంతెనకు ఇరువైపులా ఉన్న గౌరమ్మ ఆలయాలను విద్యుత్ దీప కాంతులతో అలంకరించారు. ఆలయాల వద్ద విద్యుత్ కాంతులతో ఏర్పాటుచేసిన భారీ సెట్టింగ్‌లు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. గ్రామస్తులు అమ్మవారికి తమ ఇంటి వద్ద పొన్నులు వేసి ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సంక్షేమమే లక్ష్యంగా పాలనా సంస్కరణలు

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ఉత్సాహంగా గడప గడపకూ..



ఇనుగంటివారిపేటలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అనేక సంస్కరణలు తెచ్చారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. ఇనుగంటివారిపేటలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కొనసాగించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందజేసిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు, చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేస్తున్నామన్నారు. రాష్ట్రంలో అవినీతి లేని, పారదర్శక పాలన సాగుతోందన్నారు. ప్రజలంతా జగనన్న పాలనపై అంతులేని నమ్మకాన్ని చూపిస్తున్నారని, ప్రతి గడపలో తనకు అందుతున్న అపూర్వ ఆదరణే దానికి సాక్ష్యమన్నారు. ఇనుగంటివారిపేటలో రూ.2.60 కోట్లుతో సంక్షేమ పథకాలను అందించామని, రూ 5.8 కోట్లు అభివృద్ధికి ఖర్చు చేశామన్నారు. రూ. 25 లక్షలతో సీసీ రోడ్లు, రూ.79.30 లక్షలతో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ సెంటర్ నిర్మించామని తెలిపారు. రూ.68 లక్షలతో జలజీవన్ మిషన్ ద్వారా ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం చేపడుతున్నామని, తద్వారా ఇంటింటికి సురక్షిత నీరు అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. పాఠశాలల అభివృద్ధికి నాడు – నేడు ద్వారా రూ.1.03 కోట్లు ఖర్చు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, వైస్ ఎంపీపీ 2 సత్యం మదన్ బాబు, కో కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, సర్పంచ్ సత్యం రాంపండు, గుల్లి దామోదరం, కుంచె అచ్యుత రామారావు, కుంచె లక్ష్మణరావు, ఇబ్రహీం పాల్గొన్నారు.

మహిళా సాధికారతతో సమాజ ప్రగతి

- జక్కంపూడి విజయలక్ష్మి
- మహిళా సంఘాలతో సమావేశం



పాలచర్లలో మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజానగరం: మహిళా సాధికారతతో సమాజ ప్రగతి సాధ్యమవుతుందని, అందుకే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల అమలులో మహిళలకే అగ్రస్థానం ఇస్తున్నారని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. మండలంలోని పాలచర్ల, లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలోని స్వయం సహాయక సంఘాల సభ్యులతో మంగళవారం సమావేశమయ్యారు. విజయలక్ష్మి మాట్లాడుతూ అమ్మ ఒడి, జగనన్న వసతి దీవెన, విద్యా దీవెన వంటి అనేక సంక్షేమ పథకాలను మహిళలకే అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో నివాస స్థలం లేక ఎంతోమంది పేదలు పడుతున్న ఇబ్బందులను తన పాదయాత్ర ద్వారా నేరుగా చూసిన జగన్‌మోహన్‌రెడ్డి.. అధికారంలోకి వచ్చాక ఒకేసారి 31.75 లక్షల మందికి ఇంటి పట్టాలను అందించారన్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వంలో పడిన కష్టాలను, ఎదుర్కొన్న ఇబ్బందులను ఒకసారి మననం చేసుకోవాలన్నారు. గడచిన నాలుగున్నరేళ్ల జగన్ ప్రభుత్వంలో పొందిన సంక్షేమాన్ని, అందుకున్న ప్రయోజనాలను కూడా గుర్తు చేసుకోవాలన్నారు. మహిళాభ్యున్నతి కోసం ఎవరు ఏ విధంగా పనిచేశారో, ప్రాధాన్యతనిచ్చారో గమనించి రాబోయే ఎన్నికల ద్వారా జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. అందుకు అనుగుణంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. సమావేశాలలో వెలుగు ప్రాజెక్టు ఏపీఎం హేమనాగలక్ష్మి, ఆయా గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కొబ్బరి పీచు ఉత్పత్తులతో స్వయం ఉపాధి



మాట్లాడుతున్న కేవీకే ప్రధానాధికారి డాక్టర్ నాయుడు

రాజానగరం: కొబ్బరి పీచుతో వివిధ రకాల ఉత్పత్తులను తయారీ చేయడం ద్వారా నిరుద్యోగ యువత స్వయం ఉపాధిని పొందవచ్చని కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధానాధికారి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు అన్నారు. ధవళేశ్వరంలోని క్వాయర్ బోర్డు ప్రాంతీయ కార్యాలయం సహకారంతో కొబ్బరి పీచు పరిశ్రమపై కేవీకేలో మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. కొబ్బరి పీచుతో తయారీ చేసే ఉత్పత్తులు, వాటి వలన కలిగే ప్రయోజనాలు, పారిశ్రామికంగా ఎదిగేందుకు ఉన్న అవకాశాలను వివరించారు. క్వాయర్ బోర్డు ఇన్‌చార్జి టీజీ ఏసుదాసు మాట్లాడుతూ కొబ్బరి పీచు పరిశ్రమలను ఏవిధంగా ఏర్పాటు చేయవచ్చు, అందుకుగల అవకాశాలు, రుణ సదుపాయాలపై అవగాహన కలిగించారు. వర్క్‌షాప్ వద్ద కొబ్బరి పీచుతో తయారు చేసిన డోర్ మేట్లు, బొమ్మలు, ప్లేట్లు, కోకోపీట్, బ్యాగులు, ఆభరణాలను ప్రదర్శనగా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చేతి వృత్తుల విభాగం ఇన్‌చార్జి కె.సుధాకర్, ఫ్యాకల్టీ రమేష్ రామస్వామి, ఐపీఓ ఎస్‌వీ సత్యనారాయణ, బీపీబీ మేనేజర్ డి.కార్తిక్, మాస్టర్ ట్రైనీస్ వెంకటరమణ, శ్రీకాంత్, ట్రైనింగ్ అసిస్టెంట్ అర్జున్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో పుస్తక ప్రదర్శన

సీతానగరం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. లైబ్రేరియన్ కె.శివదుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు ప్రారంభించారు. ఫాదర్ ఆఫ్ ఇండియన్ లైబ్రేరి వ్యవస్థాపకుడు ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలో కె.జెఫిబాబు, బి.శ్రేయ విజేతలుగా నిలిచారు. విజేతలకు బహుమతులు, పోటీలో పాల్గొన్న మిగిలిన విద్యార్థులకు వీజీఎస్ డిక్షనరీలను ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరే రామకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

'నన్నయ' అధ్యాపకుడికి పీహెచ్‌డీ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో అధ్యాపకుడిగా పనిచేస్తున్న తాతపూడి అశోక్‌కు వీసీ ఆచార్య కె.పద్మరాజు పీహెచ్‌డీని ప్రదానం చేశారు. మెషిన్ లెర్నింగ్ టెక్నిక్‌లతో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌ని ఉపయోగించి పర్యావరణ కారకాలు, నేల పోషకాల ఆధారంగా తగిన పంటను అంచనా వేయడం అనే అంశంపై అశోక్ చేసిన పరిశోధనకు ఈ పీహెచ్‌డీ లభించింది.

గైట్ విద్యార్థుల సత్తా

రాజానగరం: సెంట్రల్ జోన్ ఫుట్‌బాల్ పురుషుల అంతర్ కళాశాలల టోర్నమెంట్స్ కమ్ యూనివర్సిటీ టీమ్ సెలక్షన్స్‌లో గైట్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. విజయవాడలోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 18 నుంచి 20 వరకు జరిగిన ఈ పోటీలు జరిగాయి. తమ విద్యార్థులు యూనివర్సిటీ టీమ్ సెలక్షన్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ తెలిపారు. ఆ విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన కోచ్ డాక్టర్ సీఎం హెన్రీలను అభినందించారు.

గోశాలకు పశుదాణా వితరణ



ఇస్కాన్ గోశాలకు పశుదాణా అందిస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సత్యగోవిందు

రంగంపేట: మండల పరిధిలోని జి.దొంతమూరు ఇస్కాన్ గోశాలలోని గోవులకు పశుసంవర్ధకశాఖ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ మోటూరి కోటేశ్వరరావు రూ.30 వేలు విలువైన 500 కేజీల పశుదాణా, 100 కేజీల మినరల్ మిక్చర్ సమకూర్చారు. మంగళవారం గోశాల ఇన్‌చార్జి రవీంద్ర చైతన్యదాసుకు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఎస్‌టీజీ సత్యగోవిందు వాటిని అందజేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి ఈ.జాన్‌పాల్, గోపాలమిత్ర బత్తిన శివ, వీరంపాలెం పశుసంవర్ధక సహాయకుడు కె. సురేష్ పాల్గొన్నారు.

యువకుడికి దేహశుద్ధి

అనపర్తి: తన కుమార్తెకు మాయమాటలు చెప్పి, వెంట తీసుకువెళ్లిపోవాలని ప్రయత్నిస్తున్న ఓ యువకుడికి బాలిక తండ్రి, కుటుంబ సభ్యులు దేహశుద్ధి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. దీనికి సంబంధించిన వీడియో సోమవారం రాత్రి సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. బాలిక తండ్రి పోలీసుశాఖలో చిరుద్యోగిగా విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. దీనిపై శివగణేష్‌ను వివరణ కోరగా సోషల్ మీడియాలో వచ్చిన వీడియో ఆధారంగా విచారణ చేపట్టామని, దీనిపై స్థానిక వీఆర్‌ఓ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

సర్వే సమర్థంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సాయిబాబు

పెదపూడి: మండలంలో కులగణన సర్వేను అధికారులు సమర్ధవంతంగా నిర్వహించాలని ఎంపీడీఓ వీవీ సాయిబాబు, తహసీల్దార్ టి.సుభాష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులు, పీఈటీ ఉపాధ్యాయులు, ఆరోగ్యశాఖ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు, వీఆర్వోలు, డిజిటల్ అసిస్టెంట్లకు సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ కులగణనకు సంబంధించి ముగ్గురు డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇప్పించామన్నారు. రేపటి నుంచి వలంటీర్లు, ఇతర అధికారులకు శిక్షణనిచ్చి అనంతరం కులగణన సర్వే చేపడతారన్నారు. ఎంపీడీఓ సాయిబాబు మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి చేపట్టే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ తదితర క్రీడల్లో పాల్గొనేందుకు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సీహెచ్‌వీవీ సత్యనారాయణ, ఈఓపీఆర్డీ సత్యనారాయణరెడ్డి, సచివాలయ కార్యదర్శులు మన్యం శ్రీనివాసుచౌదరి, యాళ్ల ఉమామహేశ్వరరావు, జి.త్రినాథ్, అచ్చిరాజు పాల్గొన్నారు.